వార్త, హైదరాబాద్, ఆదివారం 2, మార్చి 2025

# మొదటిరోజు ఎప్‌సెట్‌కు 5,010 దరఖాస్తులు

## ఏప్రిల్ 4 వరకు గడువు

**హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో ఇంజనీరింగ్‌తోపాటు, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ అగ్రికల్చర్, ఫార్మసీ కామన్‌నఎంట్రన్స్ టెస్ట్(ఈఏపీ సెట్)-2025 దరఖాస్తుల ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభమైంది. మొదటి రోజు 5010 దరఖాస్తులు వచ్చినట్లు ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్ కుమార్, కో కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మొదటిరోజు ఇంజనీరింగ్‌కి 3,116 దరఖాస్తులు రాగా.. అగ్రికల్చర్, ఫార్మసీకి 1,891 దరఖాస్తులు వచ్చాయి. రెండింటికి మూడు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఎప్ సెట్-2025 నోటిఫి కేషన్‌ను ఫిబ్రవరి 20న జారీ చేయగా.. దరఖాస్తులను శనివారం(మార్చి 1) నుంచి స్వీకరిస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఏప్రిల్ 4 వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలను ఏప్రిల్ 29, 30 తేదిల్లో నిర్వహించనుండగా.. ఇంజనీరింగ్ పరీక్ష లను మే 2 నుంచి 5 వరకు నిర్వహించనున్నారు. పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహంచనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఒక సెషన్‌ను.. మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు మరో సెషన్‌ను కొనసాగించనున్నట్టు ఎప్ సెట్ అధికారులు ప్రకటించారు.

నమస్తే తెలంగాణ హైదరాబాద్, ఆదివారం 2 మార్చి 2025

# ఎప్‌సెట్‌లో ఏపీ సెంటర్లు ఔట్

- ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- తొలిరోజు 5,010 దరఖాస్తులు

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఎప్‌సెట్‌కు ఏపీలో ఏర్పాటు చేయాలనుకున్న సెంటర్లను అధికారులు తొలగించారు. ఎప్‌సెట్‌లో ఏపీ కోటా సీట్లను నిలిపివేయడంతో సెంటర్ల రద్దు నిర్ణయం తీసుకున్నారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో 100 శాతం సీట్లను రాష్ట్ర విద్యార్థులకే రిజర్వుచేస్తూ జీవో జారీ చేశారు. ఎప్‌సెట్ ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ శనివారం ఉదయం నుంచి ప్రారంభమయ్యింది. తొలిరోజు మొత్తం 5,010 మంది దరఖాస్తులు సమర్పించారు. వీరిలో ఇంజినీరింగ్‌కు 3,116 మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగానికి 1,891 మంది, రెండు పరీక్షలకు హాజరయ్యేందుకు ముగ్గురు చొప్పున విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్‌కుమార్ తెలిపారు. ఆలస్య రుసుము లేకుండా ఏప్రిల్ 4 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముందని వెల్లడించారు.

# లాసెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ) : లా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే లాసెట్ ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ శనివారం ఆలస్యంగా ప్రారంభమయ్యింది. సాయంత్రం 4గంటల తర్వాత దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. షెడ్యూల్ ప్రకారం శనివారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభంకావాల్సి ఉండగా, ఉదయం నుంచే అభ్యర్థులకు ఎదురుచూపులు తప్పలేదు. ఎట్టకేలకు సాయంత్రం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. తొలిరోజు కేవలం 30 మంది మాత్రమే దరఖాస్తులు సమర్పించారు. ఏప్రిల్ 15 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముంది.

నవతెలంగాణ ఆదివారం 2 మార్చి 2025

# ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

- మొదటిరోజు -5,010 దరఖాస్తులు : కన్వీనర్ డీన్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆన్‌లైన్‌లో శనివారం నుంచి ప్రారంభమైంది. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటిరోజు ఇంజినీరింగ్ విభాగానికి 3,116 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 1,891 మంది, రెండింటికీ ముగ్గురు కలిపి మొత్తం 5,010 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. ఆలస్య రుసుం లేకుండా వచ్చేనెల నాలుగో తేదీ వరకు దరఖాస్తుల సమర్పణకు అవకాశముందని తెలిపారు. ఆలస్య రుసుంతో అదేనెల 24 వరకు దరఖాస్తులను సమర్పించొచ్చని సూచించారు. ఏప్రిల్ 29 నుంచి మే ఐదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఏప్రిల్ 29,30 తేదీల్లో ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు, మే రెండు నుంచి ఐదో తేదీ వరకు ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఇతర వివరాల కోసం https://eapcet.tgche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి
హైదరాబాద్ • ఆదివారం 2 మార్చి 2025

# తొలి రోజు ఎప్‌సెట్‌కు 5,010 దరఖాస్తులు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్-2025కు తొలిరోజు 5,010 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మూడేళ్లలో మొదటి రోజే ఈస్థాయిలో దరఖాస్తులురావడం ఇదే ప్రథమం. శనివారం ఉదయం 11.45 గంటలకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణను ఎప్‌సెట్ అధికారులు ప్రారంభించారు. ఇంజనీరింగ్ స్ట్రీమ్‌కు 3,116, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్‌కు 1,891, రెండింటికీ ముగ్గురు అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించినట్లు ఎప్‌సెట్ కన్వీనర్ తెలిపారు. టీజీఎప్‌సెట్‌కు ఈ ఏడాది నుంచి ఏపీ అభ్యర్థులకు అవకాశం లేకపోవడంతో గతేడాదికంటే సుమారు 50-70వేల వరకు దరఖాస్తులు తగ్గే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఈనాడు ఆదివారం మార్చి 2, 2025

# ఎప్‌సెట్‌కు తొలిరోజు 5 వేల మంది దరఖాస్తు

## లాసెట్ దరఖాస్తుల స్వీకరణా ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ శనివారం ఉదయం నుంచి మొదలైంది. సాయంత్రం 5.30 గంటల వరకు 5,010 మంది దరఖాస్తు చేశారు. వారిలో ఇంజినీరింగ్ విభాగానికి 3,116 మంది, అగ్రికల్చర్-ఫార్మసీకి 1,891 మంది, రెండిటికి మరో ముగ్గురు దరఖాస్తు సమర్పించారని ఎప్‌సెట్ కన్వీనర్ బి.డీన్‌కుమార్ తెలిపారు. లాసెట్ దరఖాస్తుల స్వీకరణ కూడా శనివారం సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమైంది. ఈసెట్‌కు ఈ నెల 3 నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు.